మహిళలే కింగ్ మేకర్లు!

- అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్న మహిళలు
- నియోజకవర్గంలో పోలైన ఓట్లు 1,62,760
- పురుషులు 80,335, మహిళలు 82,379
- పురుషుల కంటే మహిళల ఓట్లు 2,047 ఎక్కువ


ఆత్మకూరులో ఓటు వేసేందుకు బారులుదీరిన మహిళలు (ఫైల్)

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మహిళల ఓట్లే గెలుపోటములను శాసించనున్నాయి. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని ఆత్మకూరు, శ్రీశైలం, మహానంది, బండిఆత్మకూరు, వెలుగోడు మండలాల్లో మొత్తం 1,96,116 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 80,335, మహిళలు 82,379 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పురుషుల కంటే మహిళలు దాదాపు 2,047 మంది మహిళా ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. మొత్తం నియోజకవర్గంలో 1,62,760 ఓట్లు పోలయ్యాయి.

పోలింగ్ కేంద్రాల వారీగా..

నియోజకవర్గంలోని శ్రీశైలంలో వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తే శ్రీశైలంలో 02, 07, 09 పోలింగ్ కేంద్రాల్లో పురుషుల కంటే మహిళలు అధికంగా ఓటు వేశారు. అలాగే ఇదే మండలంలోని సున్నిపెంట, శ్రీశైలంలోని 12, 13, 14, 15, 16, 17, 19 పోలింగ్ కేంద్రాల్లోనూ వారే అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆత్మకూరు మండలంలో ప్రధానంగా చెంచుగూడెంలైన బైర్లూటీ, పెద్దచెరువు, కొట్టాల చెరువు పోలింగ్ కేంద్రాలైన 28, 41, 42 పోలింగ్ కేంద్రాల్లో కూడా చెంచు గిరిజన మహిళలు అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆత్మకూరు పట్టణం, రూరల్‌లో వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తే 33, 45, 47, 48, 49, 50, 65, 74, 95, 92, 93, 87 పోలింగ్ కేంద్రాల్లో మహిళలే ఎక్కువగా ఓట్లు వేశారు. వెలుగోడు మండలంలో 101, 102, 116, 119, 136, బండిఆత్మకూరు మండలంలో 152, 153, 158, 182, మహానంది మండలంలోని 225, 222, 233, 239, 200, 205, 217, 218, 204–207 పోలింగ్ కేంద్రాల్లో పురుషుల కంటే మహిళల ఓట్లే అధికంగా పోలయ్యాయి.

వైఎస్సార్‌సీపీ వైపే మహిళల మొగ్గు..

నియోజకవర్గంలోని పలు మండలాల్లో పురుషుల కంటే మహిళలే వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపారనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా పింఛన్లు తీసుకునే వృద్ధులు, 45–60 సంవత్సరాల్లోపు మహిళలు, వితంతువులు, అమ్మ ఒడి పొందిన మహిళలు అధికంగా వైఎస్సార్‌సీపీకి ఓటువేసినట్లు సమాచారం. పొదుపు గ్రూపుల సభ్యులు కూడా మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. పురుషుల్లో చాలామంది వివిధ వర్గాలుగా ఓటు వేసినట్లు సమాచారం. శ్రీశైలం నియోజకవర్గంలో మహిళా ఓట్లు అధికంగా పోల్ కావడం, వారు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపడంతో 15 వేల నుంచి 20 వేల ఓట్ల మెజార్టీతో శిల్పా చక్రపాణిరెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించే అవకాశం ఉంది.

క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

టీకాతో వ్యాధుల నివారణ


కొణిదేలలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని రైతులు పశువులకు టీకాలు వేయించడంతోనే వ్యాధులను నివారించవచ్చని కొణిదేల పశువైద్యాధికారి నవీన్ తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలవుతున్న సందర్భంగా పశువులకు గొంతువాపు, చిటుకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. టీకా వేయడంతో పశువుల్లో వ్యాధులు రాకుండా నివారించవచ్చని అన్నారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు


వేప దారు వృక్షం వద్ద ఉంచిన బోనం కుండలు


ప్రతిష్ఠించిన సుంకులమ్మ దేవత

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు గ్రామంలో మంగళవారం సుంకులమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అమ్మవారికి గ్రామస్తులు సాంప్రదాయ బద్ధంగా బోనం కుండలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యాలు సమర్పించారు. వేప దారు వృక్షం వద్ద బోనాలుంచి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఇంటి నుంచి ప్రజలు నైవేద్యాలు, కాయ, కర్పూరాలు అమ్మవారికి సమర్పించి దర్శనం చేసుకున్నారు. బంధు మిత్రులతో ప్రతి ఇల్లు సందడిగా మారింది. గ్రామం అంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలు రకాల దుకాణాలు వెలిశాయి.

మహానందీశ్వరుడి సన్నిధిలో..


మహానందికి వచ్చిన నిరంజనరాజు దంపతులు

మహానంది: మహానంది ఆలయంలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి తమ ఇంటి ఇలవేల్పని, ఎంతో మహిమాన్వితురాలని కందుకూరి వీరేశలింగం పంతులు ముని మనవడు నిరంజనరాజు తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనార్థం మంగళవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చారు. వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. తాను ప్రతి సంవత్సరం స్వామి, అమ్మవార్ల దర్శనానికి వస్తానని చెప్పారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం

నంద్యాల టౌన్: రుతుక్రమ సమయంలో కౌమార బాలికలు, మహిళలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని జిల్లా వైద్యఆరోగ్యాధికారి వెంకటరమణ సూచించారు. మంగళవారం ప్రపంచ రుతుక్రమ ఆరోగ్య, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా సర్వజన ఆస్పత్రిలోని మాతా శిశు రక్షణ కేంద్రంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీ జీవితంలో రుతుక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కౌమార బాలికలు ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియచేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. సానిటరీ నాప్కిన్ ఉపయోగిస్తూ ఇన్ఫెక్షన్లకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండడంతో పాటు గర్భాశయ క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా ఉంటామన్నారు. అదేవిధంగా రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ శారదాబాయి, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ పద్మజ, నోడల్ ఆఫీసర్ కాంతారావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు


రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి

కొత్తపల్లి: దుకాణదారులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే, నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చర్యలు తప్పవని డోన్ సహాయ సంచాలకులు(ఏడీఏ) అశోక్‌వర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని పుష్కర ఆగ్రో ఏజెన్సీ, శ్రీ రాజరాజేశ్వరి సీడ్స్ విత్తన దుకాణాలను ఏఓ కె.మహేష్‌తో కలసి తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ దుకాణాదారులు ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలు అందుబాటులో లేవని కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కేవలం అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, అమ్మే విత్తనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని చెప్పారు.

విత్తన చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

పాములపాడు: విత్తన విక్రయ దుకాణ దారులు విత్తన చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని డోన్ ఏడీఏ అశోకవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పలు విత్తన దుకాణాలను ఏఓ ఫణీశ్వరరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్స్, ఇన్‌వాయిస్, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. గోడాములో ఉన్న విత్తనాలను, వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు.

బావిలోపడి బర్రె, దూడ మృతి

కొత్తపల్లి: గ్రామ శివారుల్లోని ఓ వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు బర్రె, దూడ పడి మృతి చెందిన ఘటన మంగళవారం మండల పరిధిలోని జి.వీరాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన స్వామిదాసు యేసురత్నం, జయమ్మలు సంవత్సరం క్రితం ఓ బర్రెను కొనుగోలు చేశారు. దానికి ఓ ఏడాది వయస్సు ఉన్న దూడా కూడా ఉంది. వీటిని మేతకోసం మూడురోజుల క్రితం గ్రామశివారుల్లో వదిలారు. రాత్రి ఇంటికి రాకపోవడంతో గ్రామశివారుల్లో, పొలాలు, చుట్టుపక్కల గ్రామాలలో వెతికినా ఫలితం లేకపోయింది. మంగళవారం ఉదయం గ్రామ శివారుల్లోని జాంగిరేల్ బాయిలో తల్లి బర్రె, దూడ కళేభరాలు నీటిపై తేలాయి. అటుగా వెళ్తున్న వ్యక్తులు చూసి వారికి సమాచారం ఇచ్చారు. నీరుతాగేందుకు వెళ్లి ప్రమాద వశాత్తు అందులోనే పడి చనిపోయి ఉంటాయని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. సుమారు రూ.70వేలు నష్టం వాటిల్లిందని యజమాని వాపోయాడు.

పురాతన దిగుడుబావి పూడ్చివేత


మట్టితో పూడ్చిన పురాతాన బావి

పగిడ్యాల: స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయం పక్కన ఉన్న అతి పురాతన దిగుడుబావిని పూడ్చివేశారు. 14వ శతాబ్దంలో పగిడ్యాలలో పగడాలు రాశులుగా పోసి విక్రయించే వారని అందుకే ఈ గ్రామానికి పగిడ్యాల నామకరణం వచ్చినట్లు ప్రతీతి. అప్పట్లో సాళువ నరసింహరాయలు వేసిన శిలా శాసనాలు నేటికి గ్రామంలోని ఊరవాకిలి వీరభద్ర స్వామి దేవాలయం, ఆంజనేయస్వామి దేవాలయం, కోట వీధి శివాలయం వద్ద ఉన్నాయి. ఈ పురాతన బావిని కూడా అప్పట్లోనే నిర్మించి ఉంటారని గ్రామస్తులు చెబుతున్నారు. కాలక్రమేణా దిగుడుబావులు నిరుపయోగంగా మారి అందులో చెత్తాచెదారం వేయడంతో దుర్గంధం వెదజల్లి దేవాలయ పవిత్రతకు భంగం కలుగడంతో ఈఓ ఎస్ రామలింగారెడ్డి సూచన మేరకు గ్రామపెద్దలు మూడు రోజులుగా శ్రమించి మట్టితో బావిని పూడ్చివేయించారు. అయితే ఎంతో చరిత్ర కలిగిన దిగుడుబావిని పూడ్చివేయడం పట్ల ప్రజల్లో భిన్న స్వరాలు వినిపిస్తుండడం గమనార్హం.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ


శిక్షణ ఇస్తున్న ఎంఈఓ మురళీమోహన్‌రెడ్డి

పగిడ్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో అమలయ్యే మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక విద్యాధికారి కార్యాలయంలో ఎంఈఓ సుభాన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం నుంచి శనివారం వరకు అమలయ్యే మెనూ పకడ్బందీగా అమలు, రుచికరంగా వంటకాలు తయారు చేసేందుకు రిసోర్స్ పర్సన్ సరళ శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎంఈఓ 2 మురళీమోహన్‌రెడ్డి, డాక్టర్ మోహన్ మాట్లాడుతూ వంట నిర్వాహకులు రోజు వారీ మెనూలో పేర్కొన్న ఆహారాన్ని రుచికరంగా తయారు చేసి ప్రభుత్వ మన్ననలు పొందాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వంట పాత్రలను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

రాజకీయ నాయకులు సంయమనం పాటించాలి


రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ, రిటర్నింగ్ అధికారి

నందికొట్కూరు రూరల్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల్లో పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు ముగిశాక ఊరేగింపులు చేయవద్దని సూచించారు. అలాగే బాణా సంచా కాల్చవద్దని, ఎవరూ గుంపులుగా ఉండరాదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా ఘర్షణలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి దాసు, సీఐలు ప్రకాశ్‌కుమార్, విజయభాస్కర్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ కలయిక

మహానంది: బండిఆత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1989–90 ఏడాదిలో పది వరకు చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈఎస్ జయభారత్ రెడ్డి, బి.వెంకటేశ్వరరెడ్డి, బీమయ్య, బి.ఉమాదేవి, జి.సామన్న ఆధ్వర్యంలో మూడు దశాబ్దాల తరువాత మిత్రులందరూ ఒకే వేదికపై కలుసుకున్నారు. వారికి పాఠాలు బోధించిన డాక్టర్ పార్వతీదేవి, డాక్టర్ పోతన, రాజశేఖర్, రామచంద్రారెడ్డి, ఆనంద ప్రభాకర్, చిదంబరరావు తదితర ఉపాధ్యాయులను సన్మానించి వారి ఆశీస్సులు పొందారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రశాంతంగా లెక్కల పరీక్ష

నందికొట్కూరు: పదో తరగతి సప్లిమెంటరీ లెక్కల్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగిందని ఎంఈఓ ఫైజున్నీసాబేగం తెలిపారు. పట్టణంలో పదో తరగతి సప్లిమెంటరీ లెక్కల్ పరీక్ష నిర్వహణ కోసం రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు 500 మంది విద్యార్థులకు గాను 260 మంది హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 238 మందికి గాను 114 మంది, గవర్నమెంట్ హైస్కూల్‌లో 262 మందికి గాను 126 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. 240 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు.

111 మంది విద్యార్థులు గైర్హాజరు

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష కేంద్రంలో 279 మందికి 111 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి సాయితిమ్మయ్య, డిపార్టు మెంటల్ అధికారి మహేష్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఉర్దూ, తెలుగు, ఆంగ్లం మధ్యామాలకు సంబంధించి మాథ్స్ పరీక్ష జరిగిందన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు పరీక్షల నిర్వహణ అధికారి ప్రభాకర్, డిపార్టుమెంటల్ అధికారి వెంకటేశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం నిర్వహించిన ప్రథమ సంవత్సరం మాథ్స్ (బీ), జువాలజీ పరీక్షలకు 44 మందికి 42 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం మాథ్స్ (బీ) పరీక్షకు ఐదుగురికి ఐదుగురు హాజరైనట్లు తెలిపారు.

మోడల్ స్కూల్లో త్వరలో అడ్మిషన్లు

- 120 సీట్లకు గాను 109 మంది దరఖాస్తు

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా మోడల్‌స్కూల్లోని ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు త్వరలో అడ్మిషన్లు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులుండగా ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున 120 సీట్లు ఉన్నట్లు తెలిపారు. సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించగా 109 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. జిల్లా అధికారుల ఆదేశాలు జారీ అయిన వెంటనే నాలుగైదు రోజుల్లో ఎంపికైన విద్యార్థుల అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లను జిల్లా అధికారుల సూచనల మేరకు భర్తీ చేస్తామన్నారు.

30న మండల సర్వసభ్య సమావేశం

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 30వ తేదీన గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగావతి మంగళవారం తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. అదేవిధంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అల్లర్లకు పాల్పడితే కటకటాలు తప్పవు


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు


మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నందికొట్కూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా ప్రక్రియ ముగిసేలా అందరూ సహకరించాలని, అల్లర్లకు పాల్పడితే కటకటాలు తప్పవని అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై పటేల్ సెంటర్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక చర్యలకు పాల్పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున రాజకీయ నేతలు, కార్యకర్తలు, ప్రజలు సంయమనంతో వ్యవహరించాలన్నారు. జిల్లాలో వచ్చే నెల నాల్గోవ తేదీన ఆర్జీఎం, శాంతరామ్ మెడికల్ కళాశాలలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ ఓట్ల లెక్కింపు జరగనుందని చెప్పారు. ఓట్ల లెక్కింపునకు ముందు, తర్వాత ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు, భద్రత చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. జూన్ 4వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు ముగిశాక ఊరేగింపులు చేయరాదని, విజయోత్సవాలు నిషేధమని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు విజయభాస్కర్, ప్రకాష్‌కుమార్, ఎస్‌ఐలు లక్ష్మీనాయణ, నాగార్జున, జగన్‌మోహన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

పగిడ్యాల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాత, కొత్త ముచ్చుమర్రి, పడమర ప్రాతకోట గ్రామాల్లో ఏఆర్ పార్టీ పోలీస్ బలగాలు కవాతు(రూట్‌మార్చ్) నిర్వహించాయి. కవాతును జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో బాణా సంచా పేల్చడం, ర్యాలీలు నిర్వహించడం, విజయోత్సవ సంబరాలు నిర్వహించడంపై ఎలక్షన్ కమిషన్ నిషేధాజ్ఞలు విధించిందని వెల్లడించారు. అనంతరం ఏఎస్పీ, డీఎస్పీ ప్రాతకోటలోని నందీశ్వర, కాశీశ్వర ఆలయంలో పూజలు నిర్వహించుకున్నారు.

చర్చి ప్రహరీ కూల్చివేత


చర్చి ప్రహరీని కూల్చిన దృశ్యం

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామం సమీపంలోని జెరూషలేం శాల చర్చి ప్రహరీని మంగళవారం నేషనల్ హైవే అధికారులు కూల్చివేశారు. అక్కడే ఉన్న భక్తులు ప్రార్థనా మందిరం ప్రహరీని కూల్చరాదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. చర్చి ఇన్‌చార్జ్ యాకోబు మాట్లాడుతూ ఎలాంటి సమాచారం అందించకుండా గోడ కూల్చడమేమిటని ప్రశ్నించారు. చర్చి స్థలాన్ని వదిలి రహదారి నిర్మాణం పక్కకు మార్చాలని హై కోర్టులో పిటీషన్ దాఖలు చేశామని వివరించారు. ఈ విషయమై ఎన్‌హెచ్ఏఐ సైట్ ఇన్‌చార్జ్ వైద్యనాథ్ స్పందిస్తూ నేషనల్‌హైవే పనుల్లో భాగంగా సేకరించిన స్థలంలో ఎలాంటి నిర్మాణాలు ఉన్నా కూల్చడం తప్పనిసరి అన్నారు. పొజిషన్ సర్టిఫికెట్ కలెక్టరు ఇచ్చారన్నారు. ప్రజలు పనులను అడ్డుకొని, వాహనాల అద్దాలు ధ్వంసం చేశారని, వారి పై కేసు నమోదు చేయాలని, ఈ విషయంపై జాయింట్ కలెక్టర్‌ను సంప్రదిస్తామని తెలిపారు. చర్చి వారు ఇంత వరకు క్లెయిమ్ చేసుకోనందున పరిహారం మంజూరుకాలేదని వీఆర్వో మక్బుల్ తెలిపారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న అంతర జిల్లా స్క్వాడ్ రాజశేఖర్

నందికొట్కూరు: రైతులకు నాణ్యత కలిగిన విత్తనాలను అందించాలని అంతర జిల్లా స్క్వాడ్, నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకులు డీ రాజశేఖర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని శ్రీరామ్ సీడ్స్, న్యూ సుధాకర్‌రెడ్డి ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, రుతుమిత్ర అగ్రో ఏజెన్సీ, శ్రీచక్ర సీడ్స్, శ్రీలక్ష్మీరంగ సీడ్స్, విశ్వంభర సీడ్స్ దుకాణాలను ఏఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్లను పరిశీలించారు. డాక్యుమెంట్లు చూపని రూ.10 లక్షల విలువైన విత్తన స్టాక్‌కు సంబంధించి విక్రయాలను నిలుపుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సోర్స్ ఆఫ్ సరిఫికెట్ లేకుండా విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం ఖాయమని హెచ్చరించారు. ఈయన వెంట ఏఓ షేక్షావలి తదితరులు ఉన్నారు.

మిడుతూరులో ధార్మిక కార్యక్రమాలు


కరపత్రాలు విడుదల చేస్తున్న జయదేవానంద స్వామి

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థాన ధార్మిక (ధార్మిక ప్రవచనాలు, భజనలు, గోపూజ) కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి మంగళవారం తెలిపారు. మంగళవారం స్థానిక ఆలయంలో శ్రీ జయదేవానందస్వామిజీ చేతుల మీదుగా ధార్మిక కార్యక్రమాల కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం శ్రీమద్రామాయణం, బుధవారం మహాభారతం, గురువారం భగవద్గీతలపై జయదేవానందస్వామిజీ ధార్మిక ప్రవచనాలు, శుక్రవారం గోపూజ, కుంకుమార్చన, ప్రతి రోజు భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రామ్మోహన్, గొల్ల రాముడు, రామకృష్ణారెడ్డి, డాలు చిట్టిబాబు, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ప్రియాంక సేవా సమితి చేయూత


సుధాకర్ కుటుంబానికి నగదు అందజేస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు శివరాముడు

జూపాడుబంగ్లా: ఆపదలో ఉన్న వారికి చేయూత నిచ్చి ఆదుకోవడమే ప్రియాంక సేవా సమితి ధ్యేయమని ఆ సమితి అధ్యక్షుడు, రిటైర్డ్ జడ్జి పల్లె మోహన్‌రావు తెలిపారు. మండలంలోని మండ్లెం గ్రామానికి చెందిన రజక సుధాకర్ అనే దివ్యాంగుడికి సేవా సమితి తరుపున బంకు ఏర్పాటు చేసి అందులో కూరగాయల వ్యాపారం, లాండ్రీ షాపు పెట్టించారు. మంగళవారం దుకాణాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తన కుమార్తె ప్రియాంక మరణం తనను ఎంతగానో కలచివేసిందని ఆమెపై ఉన్న ప్రేమాభిమానంతో ప్రియాంక సేవా సమితిని స్థాపించి ఆపదలో ఉన్న వారికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. రిటైర్డ్ టీచర్ శివరాముడు ద్వారా సుధాకర్ కుటుంబ పరిస్థితిని తెలుసుకొని తన వంతుగా చేయూత నిచ్చానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుట్టల కృపమ్మ, వెంకటరావు, రమణయ్య, నరసింహారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి


గౌరీబాయి, ఏపీఓ

జూపాడుబంగ్లా: ఐదు ఎకరాల్లోపు పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ గౌరీబాయి కోరారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఐదు ఎకరాల్లోపు పొలం ఉండి నీటి వసతి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు వారి జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఫొటోతో ఉపాధి హామీ పథకం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు మామిడి, చీనీ, నిమ్మ, తైవాన్ జామ, సపోట, దానిమ్మ, కొబ్బరి, సీతాఫలం, నేరేడు, చింత, రేగు, డ్రాగన్ ఫ్రూట్స్, మునగ వంటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ తోటల సాగుకు అవసరమైన మొక్కల సరఫరా, పొలంలో గుంతలు తీయడంతో పాటు మూడేళ్ల పాటు మొక్కల సంరక్షణకు అవసరమైన నిధులను ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లించనున్నట్లు వివరించారు. అలాగే రెండు సంవత్సరాల కాలపరిమితికి గాను మల్లె, గులాబీ వంటి పూలతోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మండలం వ్యాప్తంగా 200ఎకరాల్లో పండ్ల, పూల తోటల పెంపకాన్ని ఈ ఏడాది చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇప్పటిదాకా 100ఎకరాల్లో తోటల సాగుకురైతులు దరఖాస్తు చేసుకున్నారని, మిగిలిన 100 ఎకరాల్లో తోటల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు వెంటనే ఉపాధి హామీ పథకం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

3,065 మందికి ఉపాధి పనులు

మండలం వ్యాప్తంగా 3,065 మంది వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఏపీఓ గౌరీబాయి తెలిపారు. మండలంలోని 11 గ్రామ పంచాయతీల పరిధిలో 6,290 జాబ్‌కార్డులున్నాయని, అందులో 5,500మందికి ఉపాధి పనులు కల్పించాల్సి ఉండగా ప్రస్తుతం 3,065 మందికి పనులు కల్పిస్తున్నామన్నారు. తాటిపాడు మినహా అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గరిష్టంగా రూ.200ల నుంచి రూ.250ల వరకు కూలి గిట్టుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏల సహకారంతో కూలీల సంఖ్యను పెంచి జిల్లా అధికారులు ఇచ్చిన టార్గెట్‌ను రీచ్ అయ్యేందుకు యత్నిస్తున్నామన్నారు.